జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర- సింహాద్రిపురం : ఇటీవల జరిగిన తైక్వాండో పోటీలలో అండర్-19 కేటగిరిలో 59 కిలోల నుంచి 63 కిలోల విభాగంలో ప్రొద్దుటూరు మైస్పేస్ తైక్వాండో అకాడమి క్రీడాకారిణి రాచమల్లు కళాజ్యోష్ణ రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి స్కూలు గేమ్స్ తైక్వాండో పోటీలకు ఎంపికైంది. అదే విభాగంలో బాలుర విభాగంలో అండర్ -19 కేటగిరీలో 59 కేజీల నుంచి విభాగంలో ఇస్మాయిల్, అండర్ -19లో 63 కేజీల విభాగంలో యువరాజు కాంస్య పతకాలు సాధించారు. వీరి ప్రతిభపట్ల జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్య క్షుడు శివశంకర్రెడ్డి, తైక్వాండో ప్రధాన కార్యదర్శి మాస్టర్ నాయబ్ రసూల్, సహాయ కార్యదర్శి మహబూబ్‌బాష, కోచ్‌లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

1.60శాతం మాత్రమే హామీలు నెరవేరాయి: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: ముఖ్యమంత్రి జగన్ పాలనలో 1.60శాతం మాత్రమే హామీలు నెరవేరాయని కాంగ్రెస్ మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. చెప్పిందే చేస్తా. చేసిందే చెప్తా. ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటా. ఎన్నికల మేనిఫెస్టో లో చెప్పిన అంశాల్లోని 98.40 శాతం హామీలు నెరవేర్చా" అని శుక్రవారం నర్సీపట్నం బహిరంగ సభలో చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేపదే అపద్దాలు చెప్పడం పట్ల జగన్ తీరుపై ఆయన నిప్పులు చెరిగారు. జగన్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు అన్నారు. జగన్ వాలకరం చూస్తే బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయంత అన్నట్లుందన్నారు.జగన్, అబద్ధం కవల పిల్లలు అన్నారు. మేనిఫెస్టో లో పేర్కొన రైతులకు సంబంధించిన మొదటి అంశాన్నే నెరవేర్చలేదు. పంట వేసే సమయానికి మే నెలలో రూ.12500 లు ఇస్తాం. వడ్డీ లేని పంట రుణాలు ఇస్తాం. గిట్టుబాటు ధరకు గారంటీ ఇస్తాం. ప్రతి నియోజకవర్గంలో శీతలికరణ గిడ్డంగులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. సహకార డైరీ కి పాలు పోసే ప్రతి పాడి రైతుకు లీటర్ కు రూ. 4 బోనస్ ఇస్తాం అని మేనిఫెస్టో లో పేర్కొన్న విషయాన్ని తులసిరెడ్డి గుర్తుచేశారు. కానీ రూ.12500లో రూ.5000 లు కోత పెట్టీ మిగిలిన దానిని మూడు దఫాలుగా ఇస్తున్నాడని తెలిపారు. పావలా వడ్డీ పథకానికి పాడే కట్టారన్నారు. సున్నా వడ్డీ పథకాన్ని సున్నం పెట్టాడని విమర్శించారు. గిట్టుబాటు ధర లభించక రైతులు పండిన పంటను పొలాల్లోనే పశువులకు వదిలేస్తుండటం హృదయవిదారకరమన్నారు. శీతలికరణ గిడ్డంగులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు సొంత నియజకవర్గం పులివెందులలోనే ఏర్పాటు కాలేదని వెల్లడించారు. పాడి రైతులకు రూ.4 లు కాదు కదా 4 పైసలు కూడా బోనస్ ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఆరోగ్యశ్రీ అనారోగ్య శ్రీ లని, విద్యా దీవెన పీజీ విద్యార్థుల పట్ల విద్యా శాపం అయ్యిందన్నారు. 25 లక్షల ఇళ్లకు 25 వేల ఇల్లులు కూడా నిర్మించలేదని దుయ్యబట్టారు. నిధులు లేక జలయజ్ఞం నీరశించిందని, ఉద్యోగులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. మహిళలకు ఇచ్చిన మద్యపాన నిషేధ హామీ నేరవేరక పోగా మద్యపాన నిషా పథకంగా తయారు చేశారని విమర్శించారు. మాట తప్పడం, మడమ తిప్పడం జగన్ దినచర్యగా మారిందన్నారు. 1.60 శాతం హామీలు మాత్రమే నెరవేరాయన్నది పచ్చి నిజమన్నారు.

మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

సిద్దవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డి

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలోని ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు సిద్దవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం విశాలాంధ్రతో ఆయన మాట్లాడుతూ ఈ మండలంలోని ప్రజలు కులమతాలకు అతీతంగా అందరూ బాగుండాలని అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందేవిధంగా సచివాలయ వ్యవస్థ, వాలంటీర్లు చూడాలని ఆయన అన్నారు. ఇలాంటి నూతనసంవత్సర వేడుకలు మరెన్నో జరుపుకోవాలని సిద్దవటం, ఒంటిమిట్ట మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రాబోవు రోజుల్లో పాడిపంటలు అభివృద్ధి చెందాలని త్వరలో పశు రైతులకు మార్కెట్ కమిటీ ద్వారా రైతులను ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. అలాగే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా 30ఏళ్లు ఉండాలని ఇలాంటి ముఖ్యమంత్రి గతంలో మనం ఎప్పుడు చూడలేదని ప్రతి ఒక కుటుంబానికి రూ.2లక్షలు పైగా ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు.

ఆర్టీసీ రీజనల్ మేనేజర్, డిపో మేనేజర్‌ను కలిసిన కేవీ పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : శనివారం సాయంత్రం కేంద్రీయవిద్యాలయ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.అంజాద్ అలీ ఖాన్, కోశాధికారి జితేంద్ర, కమిటీ సభ్యులు అంజి, దుర్గా ప్రసాద్, సునీల్ కుమార్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. కేవీకు ఆరు బస్సులు సక్రమంగా వస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ సందర్భంగా ఆర్టీసీ రీజనల్ మేనేజర్, డిపో మేనేజర్ ఇద్దరూ ఆర్టీసీ నుండి పూర్తి సహకారం ఉంటుందన్నారు.

నాణ్యతతో పక్కా గృహాల నిర్మాణం:ఎంపిపి

విశాలాంధ్ర - చెన్నూరు : మండలంలోని కనపర్తి గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న పక్కా గృహాలు నాణ్యతతో నిర్మిస్తున్నారని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మండల పరిషత్ అధ్యక్షుడు చీర్ల సురేష్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం జగనన్న కాలనీలలో నిర్మిస్తున్న పక్కా గృహాలను మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, మండల అధికారులు, మండల నాయకులతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మొదటి విడతగా 650 బెసుమట్టాలు పూర్తి కావాల్సి ఉండగా 440 పూర్తి కావడం జరిగిందన్నారు. బేస్ మట్టాలు కుంగిపోకుండా గట్టిగా ఉండేందుకు బేస్ మట్టం పై గ్రేడ్ స్లాబ్ వేయడం జరుగుతుందని, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులు చేపించడం జరుగుతుందన్నారు. లేఔట్లలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారని, పక్కా గృహాల లబ్ధిదారులు అపోహలు పెట్టుకోవద్దని నాణ్యతతో నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జీఎన్ భాస్కర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ రెడ్డి (చిన్న), యువ నాయకులు రఘురామిరెడ్డి, దిలీప్ రెడ్డి సర్పంచుల సంఘం అధ్యక్షుడు సొంటం నారాయణరెడ్డి, తాసిల్దార్ అలీ ఖాన్, ఇన్చార్జి ఎంపీడీవో సురేష్ బాబు, ఏఈలు మురళి, రామలింగారెడ్డి, వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : హిందూ మతంపై, హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసి చేసిన తెలంగాణకు చెందిన బైరి నరేష్‌ను అరెస్టు చేసి అతనిపై పీడీ యాక్ట్ మోదు చేయాలని పోరుమామిళ్ల అయ్యప్ప స్వాముల సేవాసమితి ఆర్టిసి బస్టాండ్ దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేశారు. ఆర్టీసీ బస్టాండ్ దగ్గర రాస్తారోతో ఇరువైపులా వందల వాహనాలు నిలచిపోయాయి. అప్పుడే 108 వాహనం రావడంతో కొంతమంది వ్యక్తులు ఆ వాహనానికి దారి ఇచ్చారు. అనంతరం అయ్యప్ప స్వాములు ర్యాలిగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ హరి ప్రసాద్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. హిందూదేశంలో పుట్టి ఈ గాలి పిలుస్తూ ఈ మట్టిలోని తిండి తింటూ హిందూ మతాన్ని అవమాన పరుస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఉద్యోగులంటే జగన్ రెడ్డికి అలుసెందుకు: భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: ప్రభుత్వ ఉద్యోగులు అంటే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి, వైసీపీ నాయకులకు అంత అలుసెందుకని పశ్చిమరాయలసీమ పట్టణ భద్రుల శాసన మండలి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉన్న ఉద్యోగుల్ని సీఎంతో పాటు, వైసీపీ నేతలు చులకన భావనతో చూడటం బాధాకరమన్నారు. ఉద్యోగులంటే కనీసం గౌరవం ఇవ్వకపోగా వైసీపీ నేతలు అహంకారంతో నోటికొచ్చినట్టు మాట్లాడటం మంచిదికాదన్నారు. వీఆర్వో, వీఏవోలను తొలగిస్తే గ్రామాలకు పట్టిన పీడ పోతుందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడటం అత్యంత దుర్మార్గమన్నారు. ఉద్యోగుల్ని కించపరిచేలా మాట్లాడడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఉద్యోగులపై కక్ష్యసాధింపు దోరణి ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని పాదయాత్రలో పదేపదే చెప్పిన్న జగన్ రెడ్డి అధికారం చేజిక్కించుకున్న తర్వాత మాట తప్పి మోసం చేశారని విమర్శించారు. ఉద్యోగులకు ప్రతి నెలా సక్రమంగా జీతాలివ్వలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. ఉద్యోగుల సమస్యలపై శాంతియుతంగా పోరాటం చేస్తున్న ఉద్యోగుల్ని అక్రమ కేసులు బనాయిస్తామంటూ బెదిరింపులతో వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగుల్ని కించపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని రామగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

అట్లూరు వైసీపీ నేతల్లో భగ్గుమంటున్న వర్గపోరు



విశాలాంధ్ర-అట్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ఆర్ సీపీ అధికారంలో ఉన్నప్పటికీ అట్లూరు మండలంలో ఆ పార్టీకి వర్గపోరుతో ఆదరణ కరువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పుకుంటున్నారు. పార్టీలోనే వర్గపోరు ఆధిపత్యపోరు వెరసి పార్టీపై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. మండలంలో పార్టీపరంగా గానీ ప్రభుత్వ పరంగా కానీ వివిధ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే హాజరవుతున్న సందర్భాల్లో మాత్రమే హంగులు, ఆర్భాటాలు కనిపిస్తాయి. మిగిలిన సమయాల్లో అటు పార్టీ కానీ ఇటు కార్యకర్తలు ఎవరు పట్టించుకున్న పాపానపోలేదని పార్టీ కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. అంతేకాకుండా వివిధ సందర్భాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మండల నాయకులకు, ప్రజలకు ఇస్తున్న హామీలు నీటిమూటల్లా మారుతున్నాయి. దీంతో వైసీపీపై ప్రజల్లో రోజురోజుకు వ్యతిరేకత కనిపిస్తోంది. అంతేకాక పార్టీలో ప్రభుత్వపరంగా తామంటే తామే పెత్తనం చలాయించాలంటు రెండు మూడు వర్గాలుగా మండల నేతలు విడిపోయినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ పథకాలైన తాము చెప్పిందే చేయాలంటు ఇరువర్గాల వారు ఒత్తిడి తెస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. వెరసి వీటి ప్రభావం వైసీపీపై పడుతుండడంతో రాబోవు రోజుల్లో మండలంలో ఆ పార్టీకి గడ్డుకాలమేనని ప్రతిపక్ష పార్టీ ప్రజల ఆదరణకు దగ్గరవుతున్నట్లు చెబుతున్నారు. మండలంలో ఉద్యోగులు నిష్పక్షపాతంగా ప్రజలకు సేవ చేయాలనుకున్నప్పటికీ అధికార పార్టీ నేతల వర్గపోరుతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి తోడు రెండు రోజుల క్రితం ఓ ప్రభుత్వ అధికారి స్వచ్ఛందంగా అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి స్వచ్ఛందంగా బదిలీ అయ్యారు. ఇదే తరహాలో ప్రభుత్వ కార్యాలయాల్లో అట్లూరు పంచాయతీలో పనిచేస్తున్న మరో అధికారి కూడా స్వచ్ఛందంగా బదిలీ అయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇదే తరహాలో పరిస్థితి కొనసాగుతోందని బహిరంగంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ఏళ్లుగా పార్టీ జెండా మోసిన కార్యకర్తలను పక్కన పెడుతున్నారని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, వీధిలైట్లు, డ్రైనేజీ ఏ ఒక్క గ్రామంలో ఒక రోడ్డు కూడా వేయలేదని అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితిలో అధికార పార్టీ నిస్సహాయస్థితిలో ఉందని ప్రభుత్వ అధికారులకు జీతాలు కూడా సక్రమంగా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని పలువురు చెబుతున్నారు. రాబోవు ఎన్నికల్లో మండలంలో పార్టీ సమీకరణాలు మారనున్నాయని చెప్పవచ్చు.

నూతన జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడండి

ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు జి.శివకుమార్

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: విద్యార్థులకు నష్టదాయకమైన నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యార్థి వ్యతిరేక విధానాలతో భావితరాల విద్యార్థుల భవిశ్యత్తు ప్రశ్నార్థకం అని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు జి.శివకుమార్ పేర్కొన్నారు. శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 53వ ఆవిర్భావ దినోత్సవం సంధర్భంగా బ్రహ్మంగారి మఠం మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సంధర్భంగా శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్‌లు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ 1970 డిశెంబర్ 31న అధ్యయన పోరాటం నినాదంతో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా ఏర్పాటై అప్పటి నుండి ఇప్పటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ అనేక విజయాలు సాధించిందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు సురేష్‌కుమార్, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆసీఫ్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు కలివేల రాజశేఖర్, ఎర్రంపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బైరి నరేష్ వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర-పులివెందుల: అయ్యప్పస్వామిపై బైరి నరేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం పులివెందుల పట్టణంలో హిందువులు ర్యాలీ నిర్వహించారు. ఇటీవల నరేష్ అయ్యప్పస్వామి గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో హిందువులందరూ ఒకేతాటిపైకి వచ్చారు. ఈ క్రమంలో పులివెందుల పట్టణంలో భక్తులు అన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, మూలి గంగామహేష్‌రెడ్డి, టెంకాయల శ్రీనివాసులరెడ్డిలతో పాటు మరికొంత మంది హిందువులు నిరసన ర్యాలీ చేపట్టారు. అయ్యప్పస్వామిపై అసందర్భ వ్యాఖ్యలు చేసిన నరేష్ వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కోట్లాది మంది హిందువుల మనోభావాలను కించపరచే విధంగా వ్యాఖ్యలు చేసిన నరేష్‌పై చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

రేపు ఉత్తరద్వార దర్శనం



విశాలాంధ్ర - కమలాపురం : మండల పరిధిలోని రామాపురం పుణ్యక్షేత్రంలో అతి పురాతనమైన ఆలయంలో జనవరి 2వ తేదీన వైకుంత ఏకాదశి పునస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనాన్ని భక్తులకు కల్పిస్తున్నట్లు ఆలయ పుణ్యభూమి సభ్యులు శనివారం ఓ ప్రకటన తెలియజేస్తూ ఆలయంలోని శ్రీ మోక్ష నారాయణ స్వామి వల్లి దేవసేన నిత్య కళ్యాణం మూర్తులైన ఆలయంలో ఈ ఉత్తర ద్వారా గుండా లోనికి ప్రవేశించి దేవతమూర్తులను దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోయి మహా పుణ్యఫలం సిద్ధిస్తుందని వారు తెలిపారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా ఉమ్మడి జిల్లా అన్నమయ్య తో పాటు పెద్ద నగరాల నుండి మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని వారు తెలిపారు. ఈ ఆలయంలో ప్రత్యేక హెూమాలు అభిషేకాలు నిర్వహించడం ద్వారా సర్ప దోషాలు తొలిగిపోతాయన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

విశాలాంధ్ర-పులివెందుల: ముఖ్యమంత్రి జగన్ సారధ్యంతో ఈ ఏడాది కూడా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని డిస్ట్రిక్ విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సభ్యులు పైడిపల్లి కిశోర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు అన్ని వర్గాల ప్రజలకు సమానస్థాయిలో సంక్షేమ పథకాలు అందడంతో ఎక్కడా వ్యతిరేకత రాలేదన్నారు. దైవసంకల్పం తోడురావడంతో వర్షాలు కూడా సమృద్ధిగా కురిశాయి. రైతులు కూడా వివిధ రకాల పంటలను సాగుచేసుకుంటున్నారు. మున్ముందు కూడా ఇలాంటి పరిస్థితులే రావాలని, ఈ ఏడాది కూడా ప్రజలందరూ సుఖసంతోషంతో ఉండాలని కోరుతూ ఉభయ తెలుగురాష్ట్ర ప్రజలకు నూతన శుభాకాంక్షలు తెలిపారు.

కేఎస్ఆర్ఎంలో ముందస్తు న్యూ ఇయర్ సెలబ్రేషన్స్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల స్టూడెంట్స్ క్లబ్, కల్చరల్ విభాగం వారి సంయుక్త ఆధ్వర్యంలో నేడు కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో ఉత్సాహంగా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల కోశాధికారి శ్రీమతి కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ న్యూ ఇయర్ యొక్క ముఖ్య ఉద్దేశం మనకు కొత్త సంవత్సరం కావాలని కాదు చీకటి రోజులను అధిగమించి మనకు ఆత్మస్థైర్యం, ఆనందం, శక్తితో నిండిన సంవత్సరం కావాలని కోరుతూ విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తు, అనంతరం 2022వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధాన చార్యులు డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి విభాగాల అధిపతులు, డీన్‌లు కళాశాల కల్చర్ కోఆర్డినేటర్ వీరశంకర్, స్టూడెంట్ క్లబ్ కోఆర్డినేటర్ లీన రాస్తాపూర్ అధ్యాపక సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామిపై విమర్శలతో భక్తుల ర్యాలీలు

విశాలాంధ్ర - కమలాపురం : శబరిమల అయ్యప్ప స్వామి జననంపైనా,హిందూ విస్వసాలపైనా, అనుచిత వ్యాఖ్యలు చేసిన నాస్తిక సంఘ ప్రతినిధి బైరి నరేష్‌పై కఠినచర్యలు తీసుకోవాలని స్థానిక గ్రామ చావిడి నుంచి మెయిన్ బజార్, రైల్వే స్టేషన్‌ల మీదగా పోలీసుస్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు రెడ్డి సురేష్, టిడిపి యువ నాయకులు గంగవరం వెంకటేశ్వర్ రెడ్డి, రామలింగారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గురుస్వామి నర్సింహారెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప భక్తులు, హిందూ ప్రజా సంఘాలు, హిందువుల మనోభావాలను కించపరుస్తూ, భక్తుల మనోభావాలు దెబ్బతీస్తూ శ్రీ శ్రీ శబరిమల అయ్యప్ప స్వామి జన్మను అవహేళన చేస్తూ, అవమానిస్తూ అయ్యప్పస్వామి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. వారున్నారు. అంతకుముందే శబరిమల అయ్యప్ప స్వామిపై విమర్శలతో భక్తుల ఆందోళనలు,ర్యాలీలు నిర్వహించారు. బైరి నరేష్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు,శివరామిరెడ్డి, రమేశ్ రెడ్డి, టైలర్ సురేష్, మహేశ్వరరెడ్డి, అయ్యప్ప భక్త బృందం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేమన జయంతి జరపడం శుభసూచకం

అరసం జిల్లా అధ్యక్షులు ఆచార్య ఎన్ ఈశ్వర రెడ్డి

విశాలాంధ్ర-కడప వైవీయూ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేమన జయంతిని జనవరి 19వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా జరపాలని నిర్ణయించడం శుభసూచికమని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం కడప జిల్లా అధ్యక్షులు ఆచార్య ఎన్ ఈశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గొప్ప మానవతావాది, సామాజికవేత్త, సంస్కరణకారుడు, విప్లవ కవి అయిన వేమన జయంతిని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జరప తలపెట్టడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈనాటి తరానికి వేమన భావాలను, సమ సమాజ విలువలను అందించాల్సిన అవసరాన్ని ఈ జయంతి సభలు తెలియజేస్తాయన్నారు. అలతి అలతి పదాల ఆట వెలదులతో ఆబాల గోపాలాన్ని ఆకట్టుకున్న వేమన సాహిత్యం మనిషిలోని కల్మషాలను బయటపెట్టి, నిజాయితీగా అందరితో కలిసి మెలిసి జీవించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిందని, విలువలతో కూడిన వికాసం వేమన కవిత్వం నిండా తొణికిసలాడుతోందని, రాబోయే తరాలకు ఆ జ్ఞాన మాధుర్యాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ చరిత్ర సంస్కృతి భాషల నేపథ్యంలో వేమన కవిత్వ ప్రాధాన్యాన్ని ప్రపంచానికి తెలియజెప్పాలన్నారు.

ఊటుకూరు యువత ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - రాజంపేట: పట్టణ పరిధిలోని ఊటుకూరు గ్రామ యువకుల ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ పరిధిలోని పేదలను, యాచకులను ఎంచుకుని ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ వంటి ప్రధాన ప్రాంతాలలో వారు ఉన్నచోటకే వెళ్లి భోజన ప్యాకెట్లను పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఊటుకూరు యువత మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో యువకులంతా ఐకమత్యంతో గత మూడు వారాలుగా ప్రతి శనివారం పేదలకు అన్నదానం నిర్వహించడం జరుగుతోంని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగించాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టడంలోనే ఆత్మసంతృప్తి ఉంటుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సికిందర్, యు.హరికృష్ణ, రవి శేఖర్ రాజు, శివ, మోహన్, అఖిలాష్, మనోజ్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప జిల్లా స్థానిక ఐటీఐ సర్కిల్, అక్కాయపల్లెలో గల వికాస్ ఈఎం హైస్కూల్లో ముందస్తు నూతన సంవత్సర సంబరాలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి పొలిటీ బ్యూరో మెంబర్ శ్రీనివాసులు రెడ్డి, కడప నియోజకవర్గ ఇన్చార్జ్ అమీర్ బాబు, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ లీడర్ జిలాని భాష, స్కూల్ వ్యవస్థాపకురాలు సరసమ్మ, ముఖ్య అతిథులుగా హాజరై స్కూల్ కరస్పాండ్ వికాస్ హరికృష్ణతో కలిసి కేకును కట్ చేసి స్కూలు ఉపాధ్యాయులకు విద్యార్థులకు తల్లిదండ్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, విద్యార్థులు పాత సంవత్సరంలో చేసిన తప్పిదాలు పునరావృతం చేయకుండా, పాజిటీవ్ మైండ్‌తో విద్యను అభ్యసించాలన్నారు.అనంతరం రాష్ట్ర జాతీయ స్థాయిలో క్రీడలలో సాంస్కృతిక కార్యక్రమాలలో బహుమతులు సాధించిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ హమీద్, ఇంచార్జ్ స్వర్ణలత, టిడిపి నాయకులు జయకుమార్,కొమ్మలపాటి సుబ్బరాయుడు, జాకీర్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-వేంపల్లె: అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ అను వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు అయ్యప్ప భక్తులు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆర్కె వ్యాలీ స్టేషన్‌లో శనివారం వారు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక మతానికి సంబంధించి అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల కోట్లాది హైందవ భక్తుల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

క్షతగాత్రులకు ఆర్థికసాయం

విశాలాంధ్ర -వేంపల్లె: వేంపల్లె పంచాయతీ పరిధిలో వారం రోజుల క్రితం ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో గాయపడిన క్షతగాత్రులకు శనివారం ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా మానవతా సభ్యులు మాజీ జడ్పీటీసీ డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, ఏపి సివిల్ సప్లయ్ సంస్థ డైరెక్టర్ షబ్బీర్ వలీ, శ్లోకా స్కూల్ అధినేత నవనీశ్వర్ రెడ్డిల చేతుల మీదుగా బాధిత కుటుంబానికి రూ. 52.5 వేలు నగదును అందజేసినట్లు మానవత అధ్యక్షుడు కావలి క్రిష్ణతేజ తెలిపారు. క్రిష్ణతేజ మాట్లాడుతూ వారం రోజుల క్రితం బాధితులను పరామర్శించామన్నారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు, ఆయా గ్రామాల నేతలకు, రాజకీయ ప్రముఖుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. మానవతా తరుపున రూ. 5 వేలు, తిరుమల రెడ్డి రూ. 10 వేలు, మానవత సభ్యులు రూ. 12500, అలాగే మానవతా డైరెక్టర్ మస్తాన్ రెడ్డి, వారి చిన్ననాటి మిత్ర బృందం రూ. 25 వేలు, మాజీ జడ్పీటీసీ, ఏపి సివిల్ సప్లయ్ సంస్థ డైరెక్టర్ షబ్బీర్ వలీ తరుపున 5 బస్తాల బియ్యాన్ని అందజేశామన్నారు. ముఖ్యంగా బాధితుల మెరుగైన చికిత్స కోసం రవాణాకు అవసరమ్మైన అంబులెన్స్‌ను డాక్టర్ ఎస్ఎఫ్ బాషా సౌకర్యం కల్పించడం ఎంతో హర్షించదగ విషయమన్నారు. అంతేకాకుండా బాధితులకు ప్రధమ చికిత్సను ఉచితంగా అందజేశారన్నారు. అనంతరం డాక్టర్ ఎస్ఎఫ్ బాషా మాట్లాడుతూ వేంపల్లె మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేసే సేవ కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని, భవిష్యత్తులో కూడా నా తరపున మరింత సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్. ఓబుల్ రెడ్డి, ప్రతినిధులు చల్లా బాలాజీ, శ్రీకళ, శ్రావణ్ కుమార్, పి. గోవర్ధన్, నాయబ్, రంజిత్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్లాక్ లెవెల్ వాలీబాల్ పోటీలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హార్ట్ సొసైటీ అధ్యక్షులు ఎర్రంపల్లి రవి తెలిపారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ ఆదేశాల మేరకు బ్రహ్మంగారి మఠం మండలంలోని ఆర్‌సీఎం హైస్కూల్ గ్రౌండ్ నందు 2న తేదిన మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున గ్రామీన ప్రాంతాల యువకులను క్రీడా రంగాలలో ప్రోత్సాహించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మెదటి బహుమతి రూ.3వేలు, రెండవ బహుమతి రూ.2వేలుతో పాటు సర్టిఫికెట్ అందచేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8897131230, 7093844211అనే నంబర్లకు సంప్రదించాలని కోరారు.

మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

స్పెషల్ క్లాస్-1 కాంట్రాక్టర్ ఎస్.వి.రమణ

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : రాజంపేట నియోజకవర్గంలోని ప్రజలందరు సుఖసంతోషాలతో 2023 సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు స్పెషల్ క్లాస్-1 కాంట్రాక్టర్ ఎస్.వి.రమణ అన్నారు. శనివారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ ప్రజలందరు నూతన సంవత్సరంలో ఆయురారోగ్యాలతో పాడి పంటలతో వారి కుటుంబాలు ఆర్థికాభివృద్ధి చెందాలని అన్నారు. పిల్లలకు మంచి విద్యాబోధన అందించి వారి ఎదుగుదలకు తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని ఆయన అన్నారు.నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సరం, ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా

వాలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వాలంటీర్లకు వనిపెంట రోడ్డులోని డిసిసి కళ్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన అనడానికి నిదర్శనం వాలంటరీ వ్యవస్థని సీఎం జగన్ ఏర్పాటు చేసిన వాలంటరీ వ్యవస్థ సచివాలయ వ్యవస్థ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజాసేవ చేయాలని చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లవలసిన బాధ్యత వాలంటీర్లపై ఉంది. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులుగా వాలంటరీ వ్యవస్థ పని చేస్తుంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడం కేవలం ఒక వైయస్ కుటుంబం వల్లనే సాధ్యమవుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, వాలంటీర్లు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోమెకానిక్ అసోసియేషన్ కమిటీ సమావేశంను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప టౌన్ ఆటో మెకానిక్ అసోసియేషన్ కమిటీ సమావేశంను జయప్రదం చేయాలని ఆ కమిటీ అధ్యక్షులు మెకానిక్ ఎస్ కే బాబు, ఉపాధ్యక్షులు మెకానిక్ సాబ్ జాన్, కార్యదర్శి మెక్కనిక్ అమీర్ లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైయస్ ఆర్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోనీ వినాయక నగర్ సర్కిల్ దగ్గర టింకర్ సాధిక్ గ్యారేజిలో ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు కమిటీ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు అందరూ తప్పక హాజరు కావాలని వారు కోరారు. అందరూ చేరివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హసిన్‌భాష, చాంద్‌బాషా, పీర్‌భాష, ఫయాజ్, రెహమాన్,అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు:ఎంపి

విశాలాంధ్ర-సింహాద్రిపురం : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంకల్పమని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సింహాద్రిపురం మండలం నంద్యాలంపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ పాల్గొని ప్రతిఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ.. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వాటర్ గ్రిడ్ కింద నూతన బోరు వేసి ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేస్తే గ్రామంలోని ప్రతి ఇంటికీ నీరు అందుతుందని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులను వారంలో నూతన బోరు. వేసి ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంపై అవగాహన

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణం నగరిగుట్ట అర్బన్ హెల్త్ సెంటరు అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని చిన్న రంగాపురం సచివాలయం, అంగన్వాడి సెంటర్ నందు శనివారం లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డెమో రమణమ్మ గర్భవతులకి బాలింతలకి, కిశోర బాలికలకు మాతృ మరణాలు, శిశు మరణాలు తదితర అంశాల గురించి విశదీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాతృ మరణాలను అరికట్టాలంటే ఆడపిల్లలు యుక్త వయసు నుంచే రక్తహీనత రాకుండా కాపాడుకోవాలని, అందుకు ఐరన్ మాత్రలు వేసుకుంటూ కూరలు పండ్లు ప్రతిరోజు వాడాలన్నారు. గర్భము ధరించిన వెంటనే రక్తహీనత రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ,కాన్పు టైంలో రక్తస్రావం జరగకుండా చూడాలన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడు ఏ స్త్రీ కూడా హాస్పిటల్ నందు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోకూడదని అలా చేసిన ఎడల చేయించుకున్న వారికి చేసిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, అంగనవాడి టీచర్ హిమబిందు, వాలంటీర్ సుభాషిని పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందిస్తాం

సీఐ పురుషోత్తమరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : నూతన సంవత్సరం సందర్భంగా రామాలయం వచ్చే భక్తులకు నూతన సంవత్సరం, ముక్కోటి ఏకాదశి భక్తులకు మెరుగైన సేవలందిస్తామని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తమరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు అన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ, ఎస్ఐ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఒంటిమిట్ట, సిద్దవటం మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు నూతన సంవత్సరం జరుపుకోవాలని ఎలాంటి అల్లర్లు, ఘర్షణలకు దిగకుండా ప్రశాంత వాతావరణంలోజరుపుకోవాలన్నారు. ఎవరైనా బైక్ డ్రైవింగ్, అల్లర్లు చేస్తే రాత్రి 12 గంటల తరువాత కేసులు నమోదు చేసి బైక్‌లు సీజ్ చేస్తామన్నారు. ఎవరినీ ఇబ్బందులకు గురిచేయకుండా వారి ఇళ్లలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిహెడ్ కానిస్టేబుల్ సుబ్బారెడ్డి, కానిస్టేబుళ్లు వెంకటసుబ్బయ్య, హోంగార్డు బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి:టిడిపి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు భైరప్రసాద్ పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ అధ్యక్షతన మండల టిడిపి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జనవరి 2 వ తేదీ జరగబోవు ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మండలంలో ఉన్న నాయకులు కార్యకర్తలు ఏకమై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.. అదేవిధంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే ఎన్నికలలో పోరుమామిళ్ల మండలం నుండి తెలుగుదేశం పార్టీకి అత్యధిక మెజారిటీ అందించాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు రామసుబ్బారావు, మాజీ శ్రీశైలం బోర్డు మెంబర్ సీతా వెంకటసుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ ఇమామ్ హుస్సేన్, మాజీ సర్పంచ్ ఎస్.ఎం భాష, ప్రొఫెసర్ భాష, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ అధ్యక్షుడు మస్తాన్, అతికారి రాజ, ధర్వేస్, పఠాన్, చిన్నం ప్రసాద్, లక్ష్మీనారాయణ, రామయ్యపల్లె రవి, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో జాతీయస్థాయికి విద్యార్థులు ఎంపిక పట్ల ఎమ్మెల్సీ హర్షం

విశాలాంధ్ర- పోరుమామిళ్ల : తైక్వాండోలో జాతీయస్థాయికి పోరుమామిళ్ల విద్యార్థులు ఎంపిక పట్ల ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి మాట్లాడుతూ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలలో పోరుమామిళ్ల చెందిన క్రీడాకారులు ముగ్గురు జాతీయ స్థాయికి ఎంపిక అయినందుకు ఆనందంగా ఉందన్నారు. జాతీయస్థాయిలో కూడా పథకాలు సాధించి మన రాష్ట్రానికి మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అండర్ 19 విభాగంలో కాంస్య పతకం సాధించింది. అండర్ 17 విభాగంలో అబ్బూ బకార్, ఆస్రిన్, జుబేదా క్యాంస్య పథకాలు సాధించారని మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సి. భాష, కోచ్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయండి :శెట్టిపల్లి

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: ప్రతి వాలంటీరు, సచివాలయం కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుటుంబాలకు అందచేస్తూ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సైనికుల్లా పనిచేయాలని, మన ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నవరత్నాల్లో భాగంగా ప్రతి పేదకుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో వాలంటీర్ల పాలనను తీసుకువచ్చి కొంత నిరుద్యోగ సమస్య లేకుండా చూసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్ర పరిధిలో యోగి వేమారెడ్డి అన్నదాన సత్రంలో వాలంటీర్లకు అవగాహణ సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మండల అధ్యక్షులు వీరనారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. సంక్షేమ పథకాలు ప్రజల్లోకి చేరవేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం టీడీపీకి తగదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అంతా అవినీతిమయం అన్నారు. ఖాజీపేట మండలంలో పంట నష్ట పరిహారం కింద రూ.24కోట్లు కేటాయించామన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి నియోజికవర్గంలో, ప్రతి మండలంలో బూత్ కన్వీనర్‌లను ఏర్పాటచేయడం జరుగుతుందన్నారు. బ్రహ్మంగారి మఠం మండలంలోని 191మంది వాలంటీర్లు, 14సచివాలయంలు ఉన్నాయని సచివాలయానికి 3కన్వీనర్లను ఏర్పాటుచేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ రామగోవిందారెడ్డి, సోమిరెడ్డిపల్లె సహకార సొసైటీ చైర్మెన్ నేలటూరు సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ విశ్వబ్రాహ్మణుల కార్పొరేషన్ డైరెక్టర్ గొడ్లవీటి సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు భర్త రాజానాయుడు, పుల్లయ్య, వైకాపా నాయకులు మేకల రత్నకుమార్ యాదవ్, మైదుకూరు మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ భర్త శంకర్‌రెడ్డి, పాలరామిరెడ్డి, జోగయ్య, కొండా వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేధాశక్తిని పెంచుకునేందుకే లైబ్రరీలు: ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర - చెన్నూరు : జిల్లాలో మొదటిగా లైబ్రరీని ప్రారంభించింది మన మండలంలోని కనపర్తి గ్రామంలోనె నని ,విద్యార్థులు ప్రజలు లైబ్రరీల ద్వారా మేధాశక్తిని పెంచుకుంటారని అందుకు దోహదపడతాయని కమలాపురం శాసన సభ్యులు రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కనపర్తి గ్రామంలో డిజిటల్ లైబ్రరీని ఎమ్మెల్యే ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మూడో లైబ్రరీ అని, జిల్లాలో మొదటి లైబ్రరీని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అలాగే గ్రామంలోని విద్యార్థులు ప్రజలు పట్టణ ప్రాంతాలోని లైబ్రరీకి వెళ్లాలంటే కుదరదని, అందుకోసం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏ గ్రామాల్లోని ప్రజలు ఆ గ్రామాలలోనే లైబ్రరీకి వెళ్లేందుకు వీలుగా లైబ్రరీలను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపి నిర్మిస్తున్నారు. కావున ప్రతి ఒక్కరు లైబ్రరీలోకి వెళ్లి మేధాశక్తిని పెంచుకోవాలని సమాజంలో జరిగే సంఘటన తెలుసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ రెడ్డి(చిన్న), జీఎస్ భాస్కర్ రెడ్డి, పల్లె కృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి, దిలీప్ రెడ్డి, ఎర్ర సాని మోహన్ రెడ్డి, సొంటం నారాయణరెడ్డి, ప్రదీప్ రెడ్డి, కళ్యాణ్, తాసిల్దార్ అలీ ఖాన్, ఇన్చార్జి ఎంపీడీవో సురేష్ బాబు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందులలో న్యూఇయర్ సందడి

విశాలాంధ్ర -పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలో శనివారం న్యూఇయర్ సందడి కన్పించింది. ఆదివారం నూతన సంవత్సరం రానున్న నేపథ్యంలో దుకాణాలన్నీ కిక్కిరిశాయి. ఇక కేకులకు భలే గిరాకీ ఏర్పడింది. ఇదే అదునుగా భావించిన కొంత మంది వ్యాపారులు పండుగ సామాగ్రి ధరలు పెంచేశారు. నిత్యావసరాల ధరల తరహాలో ధరలను పెంచడం సామాన్యులకు మింగుడుపడటంలేదు. డిసెంబరు 31వ తేదీ రాత్రిని మందుబాబులు ప్రత్యేకత చూపిస్తారు. ఈ నేపధ్యంలో కొంత మంది యువకులు రాత్రి సందడి చేసేందుకు నరంజామా సిద్ధం చేసుకున్నారు. మరోవైపు అల్లర్లను కట్టడి చేసేందుకు పోలీస్ యంత్రాంగం కూడా సిద్ధమైంది. చీమ చిటుక్కుమంటే చర్యలు తీసుకునేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధమైంది. ఏది ఏమైనా న్యూఇయర్ వేడుకలు శాంతియుత వాతావరణంలో సాగిపోవాలని ఆశిద్దాం.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి చేస్తాం:ఎంపిపి

విశాలాంధ్ర -మైలవరం : జమ్మలమడుగు శాసనసభ్యులు డా. మూలే సుధీర్ రెడ్డి, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి సహకారంతో మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని మండల అధ్యక్షురాలు చేరెడ్డి సావిత్రి, చెన్నకేశవ రెడ్డిలు తెలిపారు. శనివారం సాయంత్రం చేరెడ్డి చెన్నకేశవ రెడ్డి నివాసంలో మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలందరికి నూతన సంవత్సరశుభాకాంక్షలు తెలిపారు.

పచ్చదనంతో పలకరించే సంస్కృతిని పాటిద్దాం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : జన విజ్ఞాన వేదిక. జాతీయ ఉపాధ్యక్షులు బి.విశ్వనాథ్ మాటా ్లడుతూ "బోకే లకు రు.150, రూ.500 వరకు వెచ్చిస్తారని.. అవి ఒక్క రోజు కూడా వుండవని కానీ రు.100 వెచ్చించిన మొక్కలో ఒక్క రూపాయి కూడా వృదా కాదని ప్రతి మొక్కను ఎవ్వరూ వృదా చేయరని తప్పకుండా తమ పెరటిలో పెంచుతారని కావున ప్రతి ఒక్కరూ మొక్కతో శుభాకాంక్షలు తెలపాలని తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ సమాచార కార్యదర్శి రాష్ట్ర కోశాధికారి సనావుల్లా, కడప జిల్లా జనవిజ్ఞాన వేదిక నాయకులు మల్లికార్జున, యస్.యం. డి.ఇలియాస్ బాషా, మల్లికార్జున, శంకరయ్య, శంకరయ్య, డాక్టర్, రాజాబాషా, వాజిద్, కరీముల్లా, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు తొలగించడం బాధాకరం

పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి కొత్తపు మునిరెడ్డి

విశాలాంధ్ర-బద్వేల్ : వృద్ధాప్య పెన్షన్‌లపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరు చాలా దుర్మార్గమని కడప పార్లమెంట్ టీడీపీఅధికార ప్రతినిధి కొత్తపు మునిరెడ్డి పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అవ్వ తాతలకు రూ.3,000 వయసుతో పని లేకుండా వృద్ధాప్య పెన్షన్ ఇస్తాను అని చెప్పిన మాట నిలబెట్టుకోక పోగా అనేక కారణాలు చూపుతూ ఉన్న వృద్ధాప్య పెన్షన్లను తొలగిస్తూ వారికి నోటీసులు ఇవ్వడం వారిని మానసికంగా హింసించడమేనన్నారు. తెలుగుదేశం పార్టీ పరిపాలనలో గత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు అనేకమందికి వృద్ధాప్య పెన్షన్లు నూతనంగా ఎంపిక చేసి వారికి 2000 రూపాయలు చెల్లించారన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్ వృద్ధాప్య పెన్షన్లను తొలగించడం తన దిగజారుడుతనానికి నిదర్శనమని త్వరలోనే జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.ఇలాంటి దుర్మార్గమైన చర్య ఇప్పటికైనా మానుకొని ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాట ప్రకారం అవ్వతాతలకు వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేసి ప్రస్తుతం ఉన్న పింఛన్లను తొలగించకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానన్నారు.

కొత్త సంవత్సరంలో అందరూ ఆనందంగా ఉండాలి

ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి

విశాలాంధ్ర- పోరుమామిళ్ల : కొత్త సంవత్సరం 2023 ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చేదు జ్ఞాపకాలు మర్చిపోయి మధుర జ్ఞాపకాలను ఆస్వాదిస్తూ ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో పండుగ వాతావరణంలో సామాజిక దూరాన్ని పాటిస్తూ బాధ్యతాయుతంగా వేడుకలు జరుపుకోవాలని ముఖ్యంగా యువత కేరింతలు ఆర్భాటాలకు దూరంగా ఉండాలని ఇంటి వద్ద తమ తల్లిదండ్రులు మీకోసం ఎదురు చూస్తూ ఉంటారని తెలియజేశారు. కొత్త సంవత్సరం అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

ఎస్సీ సంక్షేమసంఘం నూతన కమిటి ఎన్నిక

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఎస్సీ సంక్షమసంఘం రాయలసీమ అధ్యక్షుడు పి.పెద్దరాజు పట్టణంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమ సంఘం రాయలసీమ కమిటీలు రద్దు అయ్యాయని అన్నారు. నూతన కార్యవర్గంలో తన అధ్యక్షతన రాయలసీమ ప్రధాన కార్యదర్శిగా చింతల రాజేష్, రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొబ్బరపు సురేష్, కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.ఎం విలియం, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బత్తల సుబ్బరాయుడుకి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులను ఆయన ఖండించారు. తమకు ఈ బాధ్యతను అప్పగించినందుకు ధన్యవాదాలు, తాము న్యాయం చేస్తామని అన్నారు.

కేసు దర్యాప్తులో ఉంది: రూరల్ సిఐ. కొండారెడ్డి

విశాలాంధ్ర -మైలవరం : మండల పరిధిలోని వద్దిరాల గ్రామంలో గురువారం జరిగిన చోరీ కేసులో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు జమ్మలమడుగు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట కొండారెడ్డి తెలిపారు. వద్దిరాల గ్రామానికి చెందిన గురు రవీంద్ర నివాసంలో గురువారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంట మధ్యలో బీరువా లో ఉన్న 12 లక్షల అరవై వేల రూపాయలు చోరీ జరిగిందని పిర్యాదు మేరకు జమ్మలమడుగు రూరల్ సి ఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. తెలిసిన వారు చేశారా లేదా బయట ప్రాంతం నుండి వచ్చారా అనే విషయం మీద లోతుగా విచారణ చేస్తున్నట్టు సి ఐ తెలిపారు. త్వరలోనే చోరికి పాల్పడిన వారిని అరెస్ట్ చేస్తామని అన్నారు.

అభివృద్ధి పథంలో నడిచేందుకు సహకరించాలి

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సహకరించాలని వైసీపీ నాయకుడు బాబురెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులతో, ప్రజలతో సమన్వయం చేసుకుని మండలాన్ని ప్రగతి వైపు పరుగులు తీసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరికీ కొత్త సంత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ సురేంద్రనాథ్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోసాల నడుమ వేడుకలు జరుపుకోవాలన్నారు. ఏడాది పొడవునా అంతా శుభం కలగాలని, ప్రకృతి సహకరించాలని ఆయన కోరారు.

శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి: సీఐ

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని సీఐ రాజు కోరారు. స్థాని.క స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేడుకలు జరుపుకోవడం భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. అయితే పరిధిలకు లోబడి వేడుకలు జరుపుకున్నప్పుడే ప్రజాస్వామ్యం అను పదానికి అర్థం ఉంటుందన్నారు. కానీ శ్రుతి మించి వ్యవహరిస్తే ఏ స్థాయి వారైనా సరే ఉపేక్షించే ప్రసక్తే ఉండదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని కోరారు.

క్రీడాకారులను ప్రశంసించిన అఫ్జల్‌ఖాన్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ కార్యాలయం నందు ఈనెల 28-30 వ తారీకుల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ఎల్.టి చంద్రమౌళి ప్రభుత్వ పాఠశాలల పిఈటిల ఆధ్వర్యంలో టైక్వాండో పోటీలు జరిగాయి. ఈ టోర్నమెంట్ నందు కడప తైక్వాండో మాస్టర్ జంషీర్ వద్ద శిక్షణ పొందిన నలుగురు క్రీడాకారులు పాల్గొనగా వారిలో షైక్ హాలీమా సాదియా (గోల్డ్ మెడల్), కె.జెస్సికా షారుణ్ (సిల్వర్ మెడల్), షైక్ అఫ్జల్ బాషా (సిల్వర్ మెడల్), సాధించారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన క్రీడాకారులను కడప నియోజకవర్గ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ ప్రశంసించారు. భవిష్యత్తులో క్రీడాకారులు ఇంకా ఎన్నో మెడల్స్ సాధించి కడపకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుల తల్లిదండ్రులు, శిక్షకులు నరసింహ పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కేర్ క్లబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రియేటివ్ డ్రాయింగ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మైదుకూరు నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కరెడ్ల క్రిష్ణ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థులపైన ఆధారపడి ఉందని, పిల్లలందరూ శారీరక,మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని తెలిపారు. కేర్ క్లబ్ ఫౌండేషన్ చైర్మన్ సయ్యద్ యాసిన్ ట్రస్ట్ సభ్యులు విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడంలో భాగస్వాములు కావడం పట్ల వారిని అభినందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభద్రమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు కేర్ క్లబ్ ఫౌండేషన్ వారు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఓబులేసు మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు మంచిదని వాటికి తోడ్పాటు అందించిన ట్రస్టు సభ్యులను అభినందించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మైదుకూరు నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కరెడ్ల కృష్ణ చేతుల మీదుగా మెడల్, ట్రోఫీ, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, ట్రస్టు సభ్యులు శివ, కొండయ్య, సందీప్, వెంకటేష్, గౌస్, బ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

శెట్టివారిపల్లెను ముంపు గ్రామంగా ప్రకటించాలి

విశాలాంధ్ర-ముద్దనూరు : గండికోట జలాశయం నిర్మాణంలో వ్యవసాయ భూములన్నీ కోల్పోయి ఉపాధి కరువైన తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని మండలంలోని శెట్టివారిపల్లె గ్రామస్తులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం శెట్టివారిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ముంపు గ్రామంగా ప్రకటించి తమకు పరిహారం అందించాలని, గ్రామస్తులకు జీవనోపాధి లేదని కోరారు. రైతుభరోసా కేంద్రం సిబ్బంది. నిర్లక్ష్యం వల్ల పంటనష్టం నమోదు, బీమా మంజూరులో అర్హులకు అన్యాయం జరిగిందని, వీధిదీపాలు, రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

విశాలాంధ్ర-వీరపునాయునిపల్లె : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాజా రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మొయిళ్లచెరువు గ్రామంలో కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఏచిన్న సమస్య వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాజాతా బృందంతో పాటు స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

విశాలాంధ్ర-బి.కోడూరు : మండలంలోని పాయలకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం లో శుక్రవారం 8వ తరగతి చదువుతున్న విద్యా ర్థులకు ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు యోగానందరెడ్డిలు ట్యాబ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసమ్మ, వైఎస్సార్సీపీ నాయకులు వెంకట్నారాయణ, పిచ్చిరెడ్డి, బిల్లానరసింహులు, మండల విద్యాశాఖాధికారి మురళీదేవి, కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషలాఫీసర్ శ్రీలత, ప్రధానోపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో న్యూఇయర్ వేడుకలు

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: పట్టణ పరిధిలోని శిల్పారామంలో ఆదివారం న్యూఇయర్ వేడుకలు నిర్వహించనున్నట్లు పరిపాలనాధికారి సుధాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పులివెందుల బావర్చి రెస్టారెంటు వారి సౌజన్యంతో మాస్టర్ యువకిశోర్, యురజా డ్యాన్సింగ్ స్కూలు చిన్నారుల ఆధ్వర్యంలో సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చల్లా ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సీమాంధ్ర బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ప్రొద్దుటూరు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని అన్నారు. మానవ సేవయే మాధవ సేవ అన్నారు. ప్రతి ఒక్కరు సేవాగుణం కలిగి ఉండాలన్నారు. పట్టణంలో ఎంతో మంది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రతి మనిషి మానవత్వంతో ముందుకు నడవాలన్నారు. నెలకు 4సార్లు అన్నదాన కార్యక్రమం చేస్తున్న తనకు ఎంతో తృప్తినిస్తున్నదని పేదలు కడుపు నింపడమే తన జన్మకు స్ధారకత అని అన్నారు. ఈ కార్యక్రమంలో చౌడం రవి, చల్లా రవి, శివ, రమణ, ప్రసాద్, రాయల్ మల్లి తదితరులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-జమ్మలమడుగు : తెలంగాణ రాష్ట్రానికి చెందిన బైరి నరేష్ అయ్యప్ప స్వాములను హిందూ దేవుళ్లను కించపరిచే విధంగా మాట్లాడినందుకు అతనిపై చర్యలు తీసుకోవాలని జమ్మలమడుగు పట్టణంలో అయ్యప్ప స్వాములు, హిందూ సంఘాలు ర్యాలీ నిర్వహించారు. జమ్మలమడుగులోని పాత బస్టాండు కూడలిలో అయ్యప్ప స్వాములు బైఠాయించి బైరి నరేష్ ను వెంటనే అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. బై నరేష్‌ను వెంటనే అరెస్టు చేసి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు డిమాండ్ చేశారు

అన్నమయ్య జిల్లా

మున్సిపల్ కార్మికుల హక్కులను కాలరాయకండి

విశాలాంధ్ర-మదనపల్లి: శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ మనోజ కిరణ్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు ఈ కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చించారు 14,15 ఆర్థిక సంఘం లోని నిధులు ఖర్చు వివరాలను సభకు తెలపాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జింక చలపతి తెలపడంతో మున్సిపల్ కమిషనర్ వాటి వివరాలను సభా దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పట్టణంలో ట్రేడ్ లైసెన్స్ గల షాపుల సంఖ్య 2800 ఉన్నాయని మున్సిపాలిటీకి వాటి ఆదాయం రెండు లక్షల 50 వేలు సమకూర్చిందని మరికొన్ని షాపులు మూతపడ్డాయని సభ దృష్టికి తెచ్చారు ముఖ్యంగా 1964 ప్రభుత్వం జీవో ప్రకారం మున్సిపాలిటీ కార్మికుల హక్కుల ను కాపాడే బాధ్యత మున్సిపల్ కౌన్సిల్ పై ఉందని పలువురు సమావేశ దృష్టికి తెచ్చారు. మదనపల్లిలో కోవిడ్ సమయంలో వారు చేసిన సేవ అమోఘమని అలాంటి వారికి మున్సిపల్ కౌన్సిల్ నుంచి అందవలసిన యూనిఫాం నిత్య అవసరమైన వస్తువులను అందే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎస్సీలకు బడ్జెట్లో కేటాయించవలసిన 17 శాతాన్ని వారికి అందే విధంగా చర్యలు చేపట్టాలని విపత్తు సమయాలలో కూడా వారి హక్కులను అందించాలని ప్రభుత్వం 2005 జీవో విడుదల చేసిందని ఆ జీవో అమలయ్యే విధంగా మున్సిపల్ కౌన్సిల్ చర్యలు తీసుకోవాలని అలాగే రోడ్డు కటింగ్ ప్రజల నుంచి వసూలు చేస్తున్న డబ్బులను సరైన పద్ధతిలో ఖర్చు చేయాలని కమిషనర్‌ను కోరారు. 9వ వార్డు కౌన్సిలర్ గీత పరిధిలో ఉన్న సచివాలయం ఎదుట దిశా ప్రచార బ్యానర్ ఏర్పాటు చేయడంతో కొందరు వైసిపి నాయకులకు తొలగించాలని సచివాల సిబ్బందిపై ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమని చైర్మన్ దృష్టికి కౌన్సిలర్ గీత తెచ్చారు స్పందించిన చైర్మన్ అలాగా జరగనివ్వమని హామీ ఇచ్చారు. తడి చెత్త పొడి చెత్తపై ప్రత్యేక దృష్టి సారించి వీధులలో సరైన సమయానికి శుభ్రపరచాలని వాటిని డంపింగ్ యార్డ్ కు తరలించి ఆదాయాన్ని పెంచాలని బెంగళూరు బస్టాండ్ లో రోజురోజుకు వ్యర్థ పదార్థాలతో సరైన శుభ్రత లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని మున్సిపల్ కౌన్సిలర్ కాజా సభ దృష్టికి తెచ్చారు ఈ కార్యక్రమంలో కౌన్సిల్లో అధికారులు తదితరులు పాల్గొన్నారు

మిట్స్‌లో వెబ్ క్లబ్ ప్రారంభం

విశాలాంధ్ర-మదనపల్లి: ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్, మదనపల్లె నందు వెబ్ క్లబ్ ను ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతితులుగా విప్రో క్యాంపస్ లీడ్ హేమలత, ఎత్నస్ ప్రైవేట్ లిమిటెడ్ సి. ఈ. ఓ బద్రీనాథ్ లింగరాజు మరియు మేనేజర్ ఇంపాక్ట్ ప్రోగ్రామ్స్, ఎత్నస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉమేష్ కారంత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల చివరి సంవత్సర విద్యార్థులు సుమారు 1000 మందికి పైగా ఉద్యోగాలు లభించాయని, అందులో ఎక్కువ వేతనంతో ఉద్యోగం పొందిన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ వారిని ఈ సందర్భంగా సత్కరించారు. నాస్కామ్ సంస్థ వారు నిర్వహించిన అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ గ్రో విత్ గూగుల్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం లో జాతీయ స్థాయిలో అత్యధికంగా 2600 మంది విద్యార్థులు కళాశాల నుంచి ప్రతిభ కనపరిచి సర్టిఫికెట్ లు పొందారని, రాష్ట్ర స్థాయి లో టాప్ కళాశాలగా నిలిచిందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఎస్.ఈ విభాగాధిపతి డాక్టర్ పీ. కల్పన, వెబ్ క్లబ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నిత్యా, ప్లేసెమెంట్ ఆఫీసర్ గౌడ, ద్రుపద్ వర్మ, డాక్టర్ సమీనా, విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే నవాజ్ బాషా

శాలాంధ్ర - రామసముద్రం: విద్యాభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని మదనపల్లె నియోజకవర్గ శాసన సభ్యులు నవాజ్ బాషా పేర్కొన్నారు. శనివారం మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎమ్మెల్యే నవాజ్ బాషా చేతులు మీదుగా మండల వ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న 672 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో సాంప్రదాయ పద్ధతుల్లో కాకుండా సరికొత్త ఈ-లెర్నింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలనే లక్ష్యంలో భాగంగానే ముఖ్యమంత్రి ఈ-ట్యాబ్‌లను పంపిణీ కార్యక్రమం తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్, ఎం.ఈఓ హేమలత, తహశీల్దార్ విశ్వేశ్వర శాస్త్రి, ఎంపీడీఓ సురేష్ బాబు , మండల కన్వీనర్ భాస్కర్ గౌడ్, వైస్ ఎంపీపీలు రమణా రెడ్డి,గంగాధర్ నాయుడు, కేశవరెడ్డి, దొడ్డిపల్లి ఆనంద్, పాఠశాల కమిటీ చైర్మెన్ గుణశేఖర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చైతన్య డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి:ఎన్ఎస్‌యుఐ

విశాలాంధ్ర-పీలేరు: నిబంధనలకు విరుద్ధంగా అధిక పరీక్ష ఫీజులు వసూలు చేసిన పిలేరులోని చైతన్య డిగ్రీ కళాశాల పై చర్యలు తీసుకోవాలనిఎన్ఎస్ యుఐ డిమాండ్ చేశారు.శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీకి సంబంధించి డిగ్రీ 1వ, 3వ, 5వ సెమిస్టర్ పరీక్ష ఫీజుకి నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది ఏదైతే యూనివర్సిటీ విధించిన ఫీజులు కాకుండా పీలేరులోని చైతన్య డిగ్రీ కళాశాల అధిక మొత్తంలో వసూలు చేయడానికి నిరసనగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ ఆధ్వర్యంలో చైతన్య డిగ్రీ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ యూనివర్సిటీ నియమనిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేసిన చైతన్య డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు.అ ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయి సంపత్ కుమార్,హేమంత్,విశ్వ పాల్గొన్నారు.

ఆపస్ కాలమానిని ఆవిష్కరించిన డీఈవో

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన 2023 వ సంవత్సరం క్యాలెండర్ ను జిల్లా విద్యాశాఖ అధికారి వై రాఘవ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు క్యాలెండర్ను పరిశీలిస్తూ క్యాలెండర్‌లో జాతీయ భావాలను తెలియపరిచే అంశాలు చక్కగా పొందుపరిచారని, ఇవి విద్యార్థులకు ఉపాధ్యాయులలో దేశభక్తిని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సంవత్సరం ప్రచురించిన క్యాలెండర్లో గురుశిష్యుల థీం ను ఆయన మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆపస్ తరపున డిఈఓ గారికి డైరీ బహూకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగమునిరెడ్డి, ఆపస్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.వి చంద్రమోహన్, జిల్లా సహాధ్యక్షులు రామాంజనేయ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు, కోశాధికారి రామేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి మధుమతి, జిల్లా మీడియా ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సదాశివుడు,జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహులు, కార్యాలయ ప్రముఖ్ రెడ్డి ప్రసాద్, మహమ్మద్ భాషా, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర-మదనపల్లి:2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2023 సంవత్సరాన్ని ఆహ్వానిస్తు రాష్ట్ర ప్రజలందరికి మాజీ ఎమ్మెల్యే మరియు ఏఐసిసి సభ్యులు షాజహాన్ బాషా నూతన ఆంగ్ల సంవత్సరశుభాకాంక్షలు తెలిపారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో రాష్ట్ర ఓబీసీ జాయింట్ కో ఆర్డినేటర్ నాగూర్ వల్లి మరియు పట్టణ అధ్యక్షులు రెడ్డి సాహెబ్ తో కలసి షాజహాన్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర మరియు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నూతన సంవత్సరంలో నెరవేరేలా మరియు ఆయు రారోగ్యాలు అష్టైశ్వర్యాలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. నాగూర్ వల్లి మాట్లాడుతూ 2022 సంవత్సరం మిగిల్చిన జ్ఞాపకాలను పదిల పర్చుకొని, నూతన ఆంగ్ల సంవత్సరం ప్రజలందరికి సంతోషాలను మోసుకురావాలని ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రేమ పూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త ఏడాది అందరికి శుభ ఫలితాలు అందించాలని పేర్కొన్నారు. రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ గత సంవత్సరం లో ఎదుర్కొన్న కష్టాలకు స్వస్తి పలుకుతూ, శుభ ఫలితాలు అందేలా నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజలు విజ్ఞాలు, అధిగమించి శుభాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

సరికొత్త ఆలోచనలు, ఆశయాలతో ముందుకు సాగాలి:శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:గడచిన సంవత్సరపు అనుభవాలు, జ్ఞాపకాలతో నూతన ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షిం చారు.నూతన ఏడాదిలో రైతులు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు తదితర అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని, అభివృద్ధి బాటలో నడవాలని ఆయన అభిలసిం చారు. భగవంతుడి దయ, ప్రజల సహకారంతో రాయచోటి నియోజక వర్గంతో పాటు నూతన జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆయన మనసారా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజక వర్గ ప్రజలకు శ్రీకాంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సర రోజున తనను కలవడానికి వచ్చే కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, అధికారులెవ్వరూ పూలమాలలు, బొకేలు, శాలువలు కేకులు తీసుకురావద్దని, నిరా డంబరంగా నూతన సంవత్సర కార్యక్రమాన్ని జరుపుకుందామని శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

బీసీ మండల్ కమిషన్ సిఫారసు అమలు చేయాలి

విశాలాంధ్ర-పీలేరు: శనివారం బిసి మండల కమిషన్ సిఫారసు అమలు చేయాలని కోరుతూ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. అనంతరం సిఫారసు అమలు చేయాలని కోరుతూ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. అనంతరం తహసిల్దార్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ రాయల్ బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 1980వ సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన 40 సిఫారసులతో కూడిన మండల కమిషన్ నివేదిక పార్లమెంటుకు సమర్పిస్తే సుమారు 10 సంవత్సరాలు తరువాత 1990 ఆగస్టు7వతేదీన అప్పటి ప్రధాని స్వర్గీయ వి.పి.సింగ్ గారి ప్రభుత్వం కేంద్ర విద్య ఉద్యోగ నియామకాలలో 27% రిజర్వేషన్ కల్పించి కేవలం ఈ సిఫారసును మాత్రమే అమలుపరిచారు. మిగిలిన 39 సిఫారసులు ఈనాటికి 42 సంవత్సరాలు అయినా అమలుకు నోచుకోలేదు దీనిపై పార్లమెంట్లో చర్చ జరగాలని ప్రస్తుతం ఉన్న కేంద్ర ప్రభుత్వం మండల సిఫారసులను యథా విధముగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయకులు గుర్రం నారాయణ మాట్లాడుతూ ఈ దేశంలో ఉన్న వనరులన్నీ కొన్ని వర్గాల కొన్ని కులాల చేతుల్లోనే ఉన్నాయని అందరికీ అన్ని వర్గాల వారికి దక్కేంతవరకు అణగారన వర్గాల పోరాటం ఆగదని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షులు పాటూరు దామోదరం, జిల్లా జాయింట్ సెక్రెటరీ నక్క వెంకటరమణ, జిల్లా నాయకులు మద్దెల రమేష్, పులిచెర్ల మహేష్ ,మండల నాయకులు, మండల ప్రధాన కార్యదర్శి బెల్లం పురుషోత్తం, జనరల్ సెక్రెటరీ పల్లం నారాయణ, మండల ఉపాధ్యక్షులు మద్దెల మురళి, మద్దెల జనార్ధన, నాయకులు మల్లేపల్లి చంద్ర, విశ్వకాంత్, భాను ,తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు అనుమతులు లేవు:ఎస్పీ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:నూతన సంవత్సర వేడుకలకు ఎలాంటి అనుమతులు లేవని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు. తెలిపారు. శనివారం అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి పత్రికలకు విడుదలైన ప్రకటనలో ఎస్పీ పేర్కొన్నారు. అలాగే జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బంది, అధికారులు వారి కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియపరిచారు.నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ వేడుకలను నిర్వహించుకోవడానికి కొన్ని నియమ నిబంధనలను ఎస్పీ సూచించారు. రాష్ డ్రైవింగ్, బైక్ రేస్ లు, త్రిబుల్ రైడింగ్ పై కూడా ప్రత్యేక దృష్టి సారించి ఆ వాహనాలను సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అన్ని ముఖ్య కూడళ్ళలో పోలీస్ పికెట్స్, నైట్ గస్తీ బృందాలను వుంచి నూతన సంవత్సర వేడుకలలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసేలా నిరంతర పోలీసు నిఘా ఉంటుందని వివరించారు.

దేశానికే ఆదర్శం సచివాలయ వ్యవస్థ: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పుల్లంపేట : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ. పథకాల అమలులో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక వ్యవస్థ వుండాలన్న ఉద్దేశ్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్ కే దక్కుతుందన్నారు. సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పులి సునీల్ కుమార్, మండల కన్వీనర్ ముస్తాక్, జెడ్పిటిసి సభ్యులు రామనాథం, విజయకుమార్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, బికేమని, మూగ వెంకట్రెడ్డి, శంకర్రెడ్డి, నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి

విశాలాంధ్ర-కలకడ : నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లా డుతూ 2023 నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా నిర్వహిం చుకోవాలని సూచించారు. అదేవిధంగా శనివారం రాత్రి అల్లర్లు చేయకుండా, మందు బాబులు చిందులు వేయకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కోవాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదని అన్నారు. ప్రజలకు ఆటంకం కలిగించేవిధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

వేలంపాటలో రూ. 1.41లక్షల ఆదాయం

విశాలాంధ్ర-ములకలచెరువు : మండలంలోని ఎస్ఇబి పోలీస్ స్టేషన్లో శుక్రవారం నిర్వహించిన వాహనాల వేలంపాటలు ప్రభుత్వానికి రూ.1,41,128లు ఆదాయం వచ్చినట్లు సిఐ మల్లికా తెలిపారు. అక్రమంగా మద్యం తరలించి పట్టుబడిన వాహనాలకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో కొనుగోలుదారులు రూ. 1000 చెల్లించి వేలంపాటలు పాల్గొన్నారు. ఇందులో 15 ద్విచక్ర వాహనాలు విక్రయించగా రూ.1,41,128 ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం తరలించడం, మద్యం విక్రయించడం చేస్తే చర్యలు తప్పవన్నారు.

వాలంటీర్లు, కన్వీనర్లతో ఎమ్మెల్యే సమావేశం



విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి రాజంపేట నియోజవర్గంలోని సుండుపల్లి మండలాల 45 మంది సచివాలయ కన్వీనర్లతో పాటు మండల వాలంటీర్లతో రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జున్ రెడ్డి ఎంసిఆర్ కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వాలంటీర్లు ముఖ్య పాత్ర పోషిస్తే, పార్టీకి, ప్రజలకి మధ్య కన్వీనర్లు, వారదుల్ల ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ, జెడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు మెంబర్లు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు వైయస్సార్సీపి నాయకులు మండల వాలంటరీలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొరముట్ల నూతన సంవత్సర సందేశం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : వ్యవసాయ రైతులకు, కార్మిక, కర్షకులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్ని రకాల ప్రయోజనాలు చేకూర్చడంలో అహర్నిశలు పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు.2022 పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి, 2023 కొత్త సంవత్సరానికి శాంతియుతంగా స్వాగతం పలుకుదామని పిలుపునిచ్చారు. దుర్బలతను పారదోలే లోపాలను సరిదిద్దుకునే శక్తిని పొందాలని ఆకాంక్షించారు. నిజాయితీ విశ్వసనీయతలే ప్రభుత్వానికి గీటు రాయన్నారు. నియోజకవర్గ ప్రజల సంరక్షణ తమ దృఢ సంకల్పమని పేర్కొన్నారు. పథకాలను పగడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. నూతన సంవత్సరం ప్రజల జీవితాలలో సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యప్ప స్వామిని కించ పరచడం తగదు

విశాలాంధ్ర - సుండుపల్లె : తెలంగాణా హన్మకొండ జిల్లా కద్నూరు గ్రామస్తుడు బైరీ నరేష్ అనువ్యక్తి హిందూ సమాజం మీద హిందూ దేవతల చరిత్ర పై అసబ్యకరంగా మాట్లాడిన అతనిపై పిడి యాక్ట్ నమోదు చేయాలని అన్నమమ్య జిల్లా సుండుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై రమణకు పిర్యాదు అందచేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలాదారణ బృందం గోవింద మాలాదారణ బృందం భక్తులు పాల్గోన్నారు.

సకాలంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేయండి



విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని లబ్దిదారులకు సకాలంలో అందజేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ ఆఫీసర్ రఘురాం పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి లో 11వ షాపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదిక అమృత మహోత్సవంలో కార్యక్రమంలో భాగంగా ప్రతి రేషన్ షాపును తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రేషన్ షాపులో వసతులు నాణ్యత ప్రమాణాలు లబ్ధిదారులకు అందించే విధానాన్ని ఆయన గమనించారు. సంక్రాంతికి పండగకి కందిపప్పు పంచదార అందిస్తున్నామన్నారు. బియ్యము కందిపప్పు చక్కర లబ్ధిదారులకు కచ్చితంగా అందజేయాలన్నారు. అలాగే అన్నమయ్య జిల్లాలో కొత్తగా 24 64 రేషన్ కార్డులు మంజూరయ్యాయని కొత్త రేషన్ కార్డు కూడా నిత్యవసర సరుకులు అందించాలని ఆయన తెలిపారు. జనవరి ఒకటో తేదీ నుంచి సరుకులు లబ్ధిదారునికి కచ్చితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీనివాసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి ఉస్మాన్ సాబ్, డీలర్ లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌ను శిక్షించాలి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే అయ్యప్ప స్వామిని దూషించిన బైరి నరేష్ ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని లక్కిరెడ్డిపల్లి అయ్యప్ప దేవస్థానం ట్రస్ట్ సేవ సమితి ఉపాధ్యక్షుడు నాగేంద్ర వెంకటేష్ సుధీర్ పేర్కొన్నారు. శనివారం మూడు రోడ్ల నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప, విష్ణుమూర్తి మరియు పరమ శివునిపై అసభ్యకరమైన భాషను ఉపయోగించిన బైరి నరేష్ పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
జనసేన నాయకులు మలిశెట్టి వెంకటరమణ

విశాలాంధ్ర -రాజంపేట : 2023 నూతన సంవత్సర వేడుకలను రాజంపేట నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని రాజంపేట జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ మలిశెట్టి వెంకటరమణ అన్నారు. శనివారం ముందుగా నియోజకవర్గ ప్రజానీకానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి జనసేన పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు.

నరేష్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి ఫిర్యాదు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : హిందూ సమాజంపై హిందూ దేవతల చరిత్ర పైన అసభ్యంగా మాట్లాడి కించపరిచిన మూర్ఖుడు బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం బిజెపి స్టేట్ కిసాన్ మోర్చా కన్వీనర్ తోట శ్రీనివాసులు, అయ్యప్పస్వామి భక్త బృందం హిందూ ధార్మిక సంస్థల భక్తులు అదునుకోట నరసింహులు, శివాలయం అర్చకులు ధూర్జటి యోగేశ్వర శర్మ, బోయలకుంట్ల పవన్ కుమార్ శర్మ, దర్శా వెంకటరెడ్డి, పంద్రా రవి, జలదంకి మనోహర్, రామలింగయ్య ఆచారి, పాపయ్య నాయుడు, ఊటుకూరు చలపతి తదితరులు ఎస్సై మోహన్ కుమార్ గౌడ్ కు ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎస్ఐను కోరారు.

ప్రజల చెంతకే ప్రభుత్వం:ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పుల్లంపేట : ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం వత్తలూరు గ్రామ సచివాలయపరిధిలో ఈడిగపల్లి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డితో కలసి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి వస్తున్న విన తులను, సమస్యలను అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో చర్చించి. పరిష్కరించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు పులి సునీల్ కుమార్, మండల కన్వీనర్ ముస్తాకు, జడ్పిటిసి రామనాథం, విజయకుమార్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, శంకర్ రెడ్డి, బికెమని, నళినికుమార్ రెడ్డి, యశ్ పాల్ రెడ్డి, నాగేశ్వరనాయక్, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, గంగాధర్, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

విశాలాంధ్ర-రాజంపేట :నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాజంపేట జనసేన పార్టీ నాయకులు ఆకాంక్షించారు. రాజంపేట జనసేన అసెంబ్లీ ఇన్చార్జి మలిశెట్టి వెంకటరమణ ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయంలో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కేకు కోసి ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ జనసేనాని పవన్ కళ్యాణ్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్, రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి మలిశెట్టి వెంకటరమణ లు బడుగు బలహీన వర్గాలకు వెన్నుదన్నుగా ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేసే అలుపెరగని శ్రామికులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన చేనేత వికాస రాష్ట్ర కార్యదర్శి రాటాల రామయ్య, జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, భాస్కర్ పంతులు, బాల సాయి, గోపి, శంకరయ్య, ఆచారి, పోలిశెట్టి శ్రీనివాసులు, చంగల్ రాయుడు, జనసేన వీర మహిళలు జడ్డా శిరీష, గోవిందమ్మ, రజిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లిలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేటలో నెహ్రూ యువ కేంద్ర సహకారంతో శ్రీ వెంకటేశ్వర యూత్ డెవెల్ప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమల వెంకటేశ్వర, బాలాజీలు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఏడు టీమ్‌లు పాల్గొనగా కోనంపేట టీమ్ విన్నర్స్, దప్పేపల్లి టీమ్ రన్నర్స్ గా నిలిచారు. విన్నర్స్ కు 2000 రూపాయలు, రన్నర్స్ కు 1000 రూపాయల నగదు బహుమతులతో పాటు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్ర ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేయాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు రామకృష్ణయ్య, విడ్స్ ప్రతినిధి పవన్ కుమార్, యువకులు పాల్గొన్నారు.

నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గుర్రం కొండ: 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2023 సంవత్సరాన్ని ఆహ్వానిస్తు మండల ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఎంపిడిఓ కార్యాలయం లో మాట్లాడుతూ మండల మరియు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నూతన సంవత్సరంలో నెరవేరేలా మరియు ఆయురారోగ్యాలు ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. నాగూర్ వల్లి మాట్లాడుతూ 2022 సంవత్సరం మిగిల్చిన జ్ఞాపకాలను పదిల పర్చుకొని, నూతన ఆంగ్ల సంవత్సరం ప్రజలందరికి సంతోషాలను మోసుకురావాలని ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైయస్సార్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రేమ పూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త ఏడాది అందరికి శుభ ఫలితాలు అందించాలని పేర్కొన్నారు.

ముస్తాబవుతున్న దేవాలయాలు



విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నూతన సంవత్సరంలో 2 జనవరి 2023న సోమవారం వైకుంఠ ఏకాదశి పండుగ శుభ సందర్భంగా అయ్యప్ప స్వామి, సాయిబాబా స్వామి, రాఘవేంద్రస్వామి దేవాలయాల చైర్మన్ పరిటాల జగన్నాథం ఆధ్వర్యంలో, శ్రీ భుజంగేశ్వర స్వామి ఆలయం చైర్మన్ పోకల సుబ్బరా యుడు ఆధ్వర్యంలో, కె బుడుగుంటపల్లిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం యామల సిద్దేశ్వర, ఏవి రత్నంల ఆధ్వర్యంలో, కోడూరు టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం చైర్మెన్ ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయస్వామి, భక్తాంజనేయ స్వామి ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో రెడ్డివారిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన వెలసిన శ్రీపెనుశిల నరసింహస్వామి ఆలయం వ్యవస్థాపకులు, అధినేత పంద్రా నరసింహులు ఆధ్వర్యాలలో ఆలయాలు ముంగిట రంగురంగుల ముగ్గులు, ఆలయాల చుట్టూ విద్యుత్ దీపాలంకరణలతో వైభవంగా ముస్తాబవుతున్నాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా, సామాజిక దూరాన్ని పాటించే విధంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ బందోబస్తు కూడ కావాలని సంబంధిత ఆలయాల నిర్వాహకులు పోలీస్ అధికారుల అనుమతి తీసుకోనున్నారు.

భూ ఆక్రమణ పై సమగ్ర విచారణ జరిపించాలి

- మండలంలో ప్రభుత్వ భూములను కాపాడాలి
- అనధికార లేవుట్లపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ
- పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్ వెంకటేష్ డిమాండ్

విశాలాంధ్ర-పీలేరు: కలకడ మండల కదిరాయచెరువు పంచాయతీ సర్వే నంబర్ 344/1లో 1.42 భూమి ప్రభుత్వం దే అని తహశీల్దార్ పోలీసుల ఆధ్వర్యంలో సూచిక బోర్డు నాటిన రాత్రికే ఎందుకు ఆ భోర్డును తొలగించారని భూ ఆక్రమణ పై సమగ్ర విచారణ జరిపించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యం.సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్ వెంకటేష్ డిమాండ్ చేశారు.శనివారం కలకడ లో ఆ పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సాంబశివ,టి.ఎల్ వెంకటేష్ మాట్లాడుతూ ఆక్రమణ జరిగిన భూమి విషయంలో తహశీల్దార్ రికార్డు పరిశీలన చేయకుండా బోర్డు నాటారా? భోర్డును రాత్రి కి రాత్రే ఎందుకు తొలగించారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూములను కాపాడాలని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ చెపుతున్నా క్రింది స్థాయిలో ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. కొంతమంది అవినీతి రెవెన్యూ అధికారుల సహకారంతో మరోవైపు అధికార పార్టీ అండదండలతో యదేచ్ఛగా భూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయని వారు ఆరోపించారు. కదిరాయ చెరువులో జరిగిన ప్రభుత్వ భూమి ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించి మండలంలో ప్రభుత్వ భూములను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.మరోవైపు కలకడ పీలేరు గుర్రంకొండ వాయల్పాడు కె.వి పల్లి లాంటి మండల కేంద్రాల్లో పరిసర ప్రాంతాలలో పుట్టగొడుగుల్లాగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేస్తున్న వెంచర్లపై స్థానిక తాహశీల్దార్ ఎంపీడీవో లు విచారణ జరపాలని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసిన అన్నదికార లేఔట్ లపై చర్యలు తీసుకోవాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో మండల కేంద్రాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు.ఈ ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, రమణ జలాలుద్దీన్, శేషాద్రి,అఖిలేషా,అన్సర్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారిని విస్మరించడం సరికాదు

- ఎమ్మెల్యే పనితీరు పార్టీకి వ్యతిరేకంగా ఉంది
- పార్టీకి నష్టం చేస్తే సహించేది లేదు:వైసీపీ

విశాలాంధ్ర - సుండుపల్లె : రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జున రెడ్డి పనితీరు అధికార వైసీపీకి పని చేసిన ప్రతి ఒక్కరిని బాధిస్తోందని వైసీపీ అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండల కన్వీనర్ యర్రపురెడ్డి ఆనందరెడ్డి తెలిపారు. శనివారం సుండుపల్లి మండల కేంద్రానికి సమీపంలోనీ కళ్యాణ మండపంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వాలంటరీలు సచివాలయ ఉద్యోగులు సమక్షంలో నిర్వహించిన పార్టీ కార్యక్రమానికి కన్వీనర్‌తో పాటు మండలంలోని ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం సిగ్గుచేటని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి పార్టీ నాయకులతో సఖ్యతగా ఉండి ప్రజలకు మంచి చేయాలని ఆదేశిస్తే రాజంపేట నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో వ్యతిరేకంగా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పూర్తిస్థాయిలో నష్టపోతుంటే జీర్ణించుకోలేని పరిస్థితిలో పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పార్టీ గుర్తుతో గెలిచిన ప్రజాప్రతినిధులకు సైతం సమాచారం ఇవ్వకపోవడం చూస్తుంటే ఎమ్మెల్యే అధికార వైసీపీలో ఉంటూ ఏ పార్టీకి పనిచేసిన వారికి లబ్ధి చేకూరుస్తున్నారనే అనుమానాలను పార్టీ కార్యకర్తలు వ్యక్తం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని కార్యకర్తలు నాయకులు తీవ్రంగా ఖండించాలని కోరారు. అలాగే పార్టీ ముఖ్య సలహాదారులతోపాటు సీఎంను కలిసి పార్టీకి జరుగుతున్న నష్టాన్ని తెలియజేస్తామన్నారు. పదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను పక్కనపెట్టి టీడీపీ నుండి వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత వలస వచ్చిన వారికి అందలం ఎక్కించడం చూస్తుంటే అనేక అనుమానాలు వ్యక్తం వ్యక్తమవుతున్నాయని, పార్టీకి సేవ చేసిన వారికి ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పార్టీ కార్యకర్తలకు నాయకులకు అభిమానులకు ప్రాధాన్యత కల్పించాలని

హింసించడమే ప్రభుత్వ అజెండా నా? : టీడీపీ

విశాలాంధ్ర-రామసముద్రం: ప్రజలను అన్ని విధాలుగా హింసించడమే ప్రభుత్వ అజెండానా అని మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండూరు నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం మండలంలోని కెసి పలి పంచాయతీలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు . స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ విలువలు తగ్గిపోయాయని మొన్న కందుకూర్ లో జరిగిన విషాద సంఘటనను జగన్మోహన్ రెడ్డి రాజకీయం చేసి ఫోటో షూట్ల కోసం చంద్రబాబు నాయుడు ఇరుకు సందుల్లో మీటింగ్ పెట్టాడని చెప్పడం ఆక్షేపించదగిన విషయమని తెలిపారు. గతంలో ఇదే స్థలంలో జగన్మోహన్ రెడ్డి మీటింగ్ పెట్టిన విషయం మరిచిపోయాడని ఎన్టీఆర్ హయాం నుండి కూడా కందుకూరులో ఎవరు సభ జరిపిన ఎన్టీఆర్ సర్కిల్ అందే జరుపుతారని తెలియజేశారు. గతంలో పాదయాత్ర చేసినప్పుడు జగన్మోహన్ రెడ్డికి హాజరైన వ్యక్తులు వివిధ సందర్భాలలో పది మంది దాకా చనిపోయారని గుర్తు చేశార. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేశారని చెప్పారు ప్రస్తుతం ఇంటికి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తున్నారని స్మార్ట్ మీటర్ల వలన భవిష్యత్తులో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని మొబైల్ ఫోన్ ఛార్జ్ మాదిరిగా ముందుగా ఈ మీటర్లకు ఛార్జ్ చేసుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పుడు కొన్ని రోజులు లేట్ అయిన రీడింగ్ చేసేవాళ్ళు హెల్పర్లు ఇంటి దగ్గరకు వచ్చి డబ్బులు తీసుకుంటున్నారని స్మార్ట్ మీటర్లు పెడితే ఆ సౌలభ్యం ఉండదన్నారు. అదే మాదిరిగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకే మీటర్ల పెడుతున్నాడని ఉచిత విద్య ఇచ్చేటప్పుడు అక్కడ మీటర్లతో పని ఏముందని కరెంటు ఎంత కాల్తుందో తెలుసుకోవడానికి సబ్ స్టేషన్ లో ఒక మీటర్ పెడితే ఎంత కరెంటు వాడకం తెలియదా? అంటూ ప్రశ్నించారు. తుగ్లక్ నిర్ణయాలు తీసుకుంటున్నాడని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో చంద్రబాబునాయుడు గారికి ఓట్లు వేసి ఆయన ముఖ్యమంత్రిని చేస్తేనే ఈ రాష్ట్రం గాడిలో పడుతుందని ఇప్పటికే 30 ఏళ్ళ రాష్ట్ర వెనకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు యాదవ్ , శివశంకర్ విజయమ్మ, భాస్కర్, రెడ్డప్పరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వెంకటరమణారెడ్డి, కృష్ణప్ప రమణ గంగాధర్, గ్రామ కమిటీ అధ్యక్షులు మునిరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షులు ప్రజలు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు దారుణం

భైరి నరేష్ పై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

విశాలాంధ్ర-గాలివీడు:హిందువుల మనోభావాలు దెబ్బతినేలా అయ్యప్ప భక్తుల ఆరాధ్య దైవాన్ని అనుచితంగా వ్యాఖ్యానించిన భైరి నరేష్ ను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల ఐక్యవేధిక డిమాండ్ చేశారు.శనివారం బీజేపీ,ఆర్.ఎస్.ఎస్,వీహెచ్ పి,అయ్యప్ప భక్తులు సమైక్యంగా గాలివీడు పట్టణంలో గేటు రామాలయం నుండి బస్టాండు వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.ప్రధాన కూడళ్లలో భైరి నరేష్ చిత్ర పటాన్ని దగ్ధం చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం హన్మకొండకు చెందిన నాస్తిక వాది భైరి నరేష్ భారత దేశ చరిత్ర తెలుసుకోకుండా హిందూ సమాజం మీద,హిందూ దేవుళ్ళ మీద,కోట్లాది మంది ఆరాధ్య దైవమైన అయ్యప్ప పుట్టుకను ఎగతాళి చేస్తూ హేళనగా అసభ్యకరమైన పదజాలంతో దూషించడం దారుణమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే నరేష్ పై పీడీ యాక్ట్ నమోదుచేయాలని పోలీస్ స్టేషన్,తాసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు.ఈకార్యక్రమంలో అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు వీరారెడ్డి,రమేష్,రెడ్డి రిషికేశ్, మణికుమార్,సింగపూర్ ఆచారి,గురుస్వాములు వెంకటస్వామి,సుబ్బారెడ్డి,జయరాములు,రామిరెడ్డి,విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆవుల రాజ, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కుడుముల రామచంద్ర రెడ్డి,బీజేపీ మండల అధ్యక్షుడు గొట్లమిట్ల శ్రీనువాసులు,ఆర్.ఎస్.ఏఎస్ ఇంచార్జ్ హరినాథ రెడ్డి,బీజేపీ నాయకులు,ఎర్రనాగు భాస్కర్ రెడ్డి, సురేంద్ర,హిందూ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి పవన్ కుమార్,అయ్యప్ప భక్తులు రామకృష్ణ,మనితేజ రెడ్డి, నాగేంద్ర,రవి,తదితరులు పాల్గొన్నారు.

దేశానికి బీజేపీ ప్రమాదకరం: వీసీకే

విశాలాంధ్ర- మదనపల్లి: బ్రహ్మణీయ ఫాసిస్టు భావజాలంతో బీజేపీ చేస్తున్న దుర్మార్గమైన పాలన దేశానికి అత్యంత ప్రమాదకరమైనదని విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.జె విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ నందు శుక్ర, శని వారాల్లో రెండ్రోజుల పాటు వీసీకే పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరిగాయి. పీటీయం. శివప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశాలకు విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రకాశం జిల్లాలో ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన, వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి సతీష్ కు నివాళులు అర్పించిన అనంతరం తొలిరోజు సమావేశం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు కొనసాగిన ఈసమావేశాల్లో 39 మంది రాష్ట్ర కమిటీ ప్రతినిధులు సమకాలీన రాజకీయ పరిస్థితులపై ప్రసంగించారు. వీసీకే పార్టీని బలోపేతం చేయడంపై తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సమావేశాల ముగింపు సందర్భంగా విద్యాసాగర్, శివప్రసాద్ లు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్దించిన నాటి నుండి లక్షల కోట్ల పెట్టుబడితో నిర్మించుకుంటూ వచ్చిన 339 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం జరిగిందని, దీంతో దేశ ఆర్థిక వ్యవస్థకు జీవనాడులుగా వున్న స్టీలు, పెట్రోలియం, గ్యాస్, విద్యుత్, మైనింగ్, పోర్టులు, ఎయిర్ పోర్టులు, బొగ్గు, టెలికం, షిప్పింగ్, రవాణా, ఎలక్ట్రికల్, ఇతర అనేక రకాల భారీ ప్రభుత్వ రంగ సంస్థలు దేశంలో కనుమరుగు కాబోతున్నాయని, రక్షణ అంతరిక్ష రంగాలలో కూడా ప్రైవేట్ పెట్టుబడులకు అనుమతి ఇచ్చారని వివరించారు. ఇలా మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థను బడా కార్పొరేట్ సంస్థల గుప్పెట్లో పెట్టబోతున్నారని, ఈ చర్యలు దేశ స్వావలంబనను దెబ్బ తీసి పరాదీనతకు దారితీస్తాయని చెప్పారు. విదేశాల్లో దాచుకున్న నల్లధనాన్ని దేశానికి తెచ్చి, ప్రతీ ఒక్కరి ఖాతాలో 15 లక్షలు జమ చేస్తానని చెప్పి ప్రజల చేత జనధన్ అకౌంట్లు ఓపెన్ చేయించిన మోదీ, అధికారం చేపట్టి 9 ఏళ్లు కావస్తున్నా ఇంతవరకూ ఒక్కరి ఖాతాలో కూడా పదిహేను లక్షలు వెయ్యలేదని, భారతీయులు విదేశాల్లో దాచుకున్న 120 లక్షల కోట్ల నల్లధనంలో ఒక్క రూపాయి కూడా వెనక్కు తేలేక పోయారని విమర్శించారు. పేద మధ్యతరగతి వర్గాల ప్రయోజనాలు గాలికొదిలేసి, కార్పొరేట్ కుభేరులకు దేశ వనరులన్నీ దోచి పెట్టే పనిలో మోదీ తరిస్తున్నారని దుయ్యబట్టారు. తమ నిరంకుశ పాలనను ఏదేచ్ఛగా కొంసాగించడానికి రాజ్యాంగంపై కూడా దాడి చేస్తున్నారని, మత - సాంస్కృతిక పరమైన వైవిద్యాలను, వైరుధ్యాలుగా చిత్రీకరిస్తూ ప్రజల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నారని నిప్పులు చెరిగారు. బీజేపీ ఏలుబడిలో దేశ జీడీపీ తగ్గిపోతుంటే, ఆర్ఎస్ఎస్ శాఖల సంఖ్య మాత్రం గణనీయంగా పెరుగుతోందని దుయ్యబట్టారు. మనవాభివృద్ధి సూచిలో వెనుకబడ్డ మనదేశం అవినీతిలో మాత్రం ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, కావున దేశాన్ని పాలించే సామర్థ్యం - ప్రతిభ బీజేపీ లేవన్న సంగతి ప్రజలు గుర్తించాలని చెప్పారు. అత్యంత దేశ ద్రోహ చర్యలైన బీజేపీ విధాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాల్సి ఉందని, అందుకోసమే జనవరి 26న మదనపల్లెలో వీసీకే పార్టీ మహానాడు పేరుతో గొప్ప ప్రజా చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ మహాసభకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని వీరు పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో వీసీకే రాష్ట్ర నాయకులు డాక్టర్ ఇ. గోపి, బురుజు లక్ష్మీ నారాయణ, ఉలగనాధన్ గణపతి, జయసుధ, బోకం రమేష్, నాధన్ వెంకటేష్, ముత్యాల మోహన్, టి.ఎ. పీర్ బాషా, పాలకుంట శ్రీనివాసులు, సత్యవేడు మహేష్, సచిన్, బాలచంద్రబాబు, రవిశంకర్, దేవా, నవీన్, బాలకృష్ణ, ఎరుకలప్ప, వినోద్, అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలి

విశాలాంధ్ర-పీలేరు: విద్యార్థులు ఓ లక్ష్యంతో ముందుకు వెళ్ళినప్పుడే వారు తమ గమ్యాన్ని చేరుకోవడం సాధ్యమని ఎఫ్సి ఎస్ ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ అమాక్స్ సీఈఓ, యాక్స్ సంస్థ డైరెక్టర్ అయిన డాక్టర్ జి. దశరథ రెడ్డి తెలిపారు. శనివారం పీలేరు మండలం వేపులబైలు పంచాయితీ, జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితానికి ఒక అర్థం, పరమార్థం, విలువ ఉంటుందని, వాటిని గుర్తించి ఎదగాలని సలహా ఇచ్చారు. విద్యార్థులు ఏదో ఓ రంగంలో రాణించడానికి ఓ గురి అంటూ ఉండాలని చెప్పారు. దానికోసం నిరంతర కృషి, పట్టుదలతో సాధన చేస్తూ, విజయం సాధించాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి, తాము చదువుతున్న పాఠశాలతో పాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, తల్లిదండ్రులకు కూడా మంచి పేరు, ప్రఖ్యాతులు తేవాలని తెలియజేశారు. విశ్రాంత సబ్ ట్రెజరీ ఆఫీసర్ పివి రమణ మాట్లాడుతూ దాతలను స్ఫూర్తిగా తీసుకుని విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన వారు ఎందరో మహోన్నత స్థాయికి ఎదిగారని వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా దశరథరెడ్డి తమ సంస్థ ద్వారా పాఠశాలకు రూ.60,000 విలువచేసే కంప్యూటర్, కలర్ ప్రింటర్, బీరువా వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డప్ప అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వీరయ్య, ఉపాధ్యాయులు షరీఫ్, రమణ, రేణుక, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలు సరికొత్త ఆలోచనలు ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: గడచిన సంవత్సరపు అనుభవాలు, జ్ఞాపకాలతో నూతన ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు రాయచోటి తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు కోరారు. 2023 వ సంవత్సరంలో రైతులు, కార్మికులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, అభిమానులు, నాయకులు, బంధుమిత్రులు,పత్రిక విలేకరులు, మీడియా వారు తదితర అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ,ఆయురారో గ్యాలతో జీవించాలని, అభివృద్ధి బాటలో నడవాలని సుగవాసిప్రసాద్ బాబు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నియోజక వర్గ ప్రజలకు ప్రసాద్ బాబు 2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పూల బొకే వద్దు .. పూల మొక్క ముద్దు..

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:పూల బొకే వద్దు పూల మొక్క ముద్దు అనే నినాదంతో ముందుకు సాగాలని రాజంపేట బీజేపీ పార్లమెంటరీ ఇంచార్జి సాయి లోకేష్, వీఆర్డీఎస్ సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి తెలిపారు. న్యూఇయర్ పురస్కరించుకుని అన్నమయ్య కలెక్టర్ గిరీశకి పూలమొక్క ఇచ్చి అభినందలు తెలిపారు. వీఆర్డీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల ఫంక్షన్లలకి,పూలబొకెలు వాడకుండా పూల మొక్కలు ఇచ్చే విధంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూల బొకేల కోసం ఎంతో ఖర్చు చేస్తామని ఆ జ్ఞాపకాలు ఒక్క రోజు కూడా గుర్తుండవని అదే తక్కువ ధరలో ఒక పూలమొక్క ఇచ్చినట్లు అయితే పది కాలాల పాటు గుర్తుండిపోతారన్నారు. ప్రతి ఒక్కరు కనీసం రెండు మొక్కలు నాటితే పర్యావరణ పరిరక్షణతో పాటు అనేక రకాల జీవులు బతుకుతాయన్నారు వారి వెంట రమణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మాత శిశు సంరక్షణ సేవలు

-హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య

విశాలాంధ్ర-పీలేరు: అప్పుడే పుట్టిన పిల్లలు అమాయకంగా కనిపించినప్పటికి చుట్టువున్న పరిసరాలకు స్పందించే సామర్థ్యాన్ని కలిగి ఉంటారని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తల్లులకు సూచనలు ఇచ్చారు.శనివారము పి.హెచ్.సి. తలుపుల ప్రధాన వైద్యాధికారి అదేశాలమేరకు సమీప ఆవులయ్యగారిపల్లి గ్రామంలో లిగ్రామాల్లో శిశుసంరక్షణ సేవలులి భాగంగా తల్లులకు సలహాలు సూచనలిచ్చారు.ఆరు నెలలు వరకు కేవలం కమ్మని అమ్మపాలు,అమ్మస్పర్శ,సురక్షితమైనవాతావరణం,పరిశుభ్రత,ఇవన్నీ శిశువుల శారీరక మానసిక పెరుగుదలకు మరియు చురుకైన మేదస్సుకు, ప్రేరణ కలిగించే విధంగా దోహదపడతాయని, శుభ్రమైన మెత్తటి పొడి బట్టలతో శిశువును వెచ్చటి వాతావరణం కోసం తల్లి శరీరానికి దగ్గర ఉంచాలని, దోమ కాటునుండి రక్షణకు దోమతెరలు ఉపయోగించి, అన్ని రకాల పొగ బారినుండి శిశువును దూరంగా ఉంచాలని,నాటు మందులు,శరీరం పై ఎక్కడ వాతలు, చెవుల్లో ముక్కుతో నూనెలు వేయడాలు మొదలగు ఆశాస్త్రియా పద్ధతులు చేయరాదని,తల్లులకు కొండయ్య తల్లులకు ఆరోగ్య సూచనలు ఇచ్చారు.కార్యక్రమములో పి.హెచ్.యన్. వెంకటసుబ్బమ్మ,ఆశా కార్యకర్త హంసవేణి, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

వెలుగు పాఠశాలలో మ్యాజిక్ షో

విశాలాంధ్ర -మదనపల్లి: వెలుగు పాఠశాల మరియు వృద్ధాశ్రమంలో శనివారం మెజీషియన్ సురేష్ బృందంతో వికలాంగులకు ఆనందింప చేశారు. ఈ సందర్భంగా మొదట పరిపూర్ణ బోధకులు బ్రహ్మా నందరెడ్డి మాట్లా డుతూ , పిల్లలు, వృద్ధులు దేవుని తో సమానమని ఇటువంటి వారికి సేవ చేయడం చాల హర్షించదగ్గ విషయమని చెప్పారు. టౌన్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ డి.జి రామూర్తి మాట్లాడుతూ వెలుగు సంస్థ చాలా మంచి కార్యక్ర మాలు నిర్వహిస్తుందని , ముఖ్యంగా దివ్యాంగుల పిల్లల కొరకు మంచి విద్యాబుద్ధులు నేర్పిస్తూ వారిని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారని ,ఇలాంటి పిల్లల కోసం సేవచేస్తున్న వెలుగు సెక్రటరీ యం. ఉదయమోహన్ రెడ్డి ని అభినందించారు. మెజీషియన్ సురేష్ పిల్లలందరిని చాల ప్రేమతో పలకరించారు . పిల్లలతో మొదట ఆటలతో ఉత్సహపరిచిన . తరువాత మెజీషియన్ "విద్యతో పిల్లలను ఆనందింపచేశార వెలుగు సెక్రటరీ యం ఉదయ్ మోహన్ రెడ్డి మెజీషియన్ సురేష్, హెడ్ కానిస్టేబుల్ డి.జి రామూర్తి కి మెమెంటోలు అందజేశారు . సెక్రటరీ యం ఉదయ్ మోహన్ రెడ్డి , వెలుగు కన్వీనర్ ఆర్ . భాగ్యలక్ష్మి , సిబ్బంది ,చిన్నారులు , వృద్దులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం నిషేధం

విశాలాంధ్ర-ములకలచెరువు : బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించరాదని, మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ డివై.స్వామి తెలిపారు. శుక్రవారం ఎస్ఐ సిబ్బందితో కలిసి బహిరంగ ప్రదేశాలలో షెడ్లు, చెట్లు దగ్గర ఉన్న వ్యర్థ పదార్థాలను గుర్తించి పూర్తిగా కాల్చి వేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి అల్లర్లకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్ కు పంపిస్తామని ఆయన హెచ్చరించారు. పెద్దమండ్యం ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాలల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాలల్లో మద్యం సేవించి, అల్లర్లకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్ కి పంపిస్తామని తెలిపారు. డిసెంబర్ 31, నూతన సంవత్సరం జనవరి 1 న మందు బాబులపైన ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు.